# వందనోటు

అది ఆ నగరంలో కెల్లా పేరొందిన షాపింగ్ సెంటర్.

ఒక షాపు ముందు పేవ్‌మెంటు దగ్గర నిలబడి శేఖరం ఏదో పోగొట్టుకొన్నట్లు వెదకసాగాడు.

వెంకటరెడ్డి "ఏమిట్రా?" అన్నాడు.

"నోరుమూసుకో. నువ్వూ నాతో పాటు వెతుకు" అన్నాడు.

"ఏమిట్రా?"

శేఖరం మాట్లాడకుండా గబగబా షాపు ముందరికి వెళ్ళి అక్కడ నిల్చున్న అతన్ని "ఏమండీ ఇక్కడ వందరూపాయల నోటు గాని పడి ఉంటే చూశారా?" అని అడిగాడు.

"అబ్బే చూడలేదండీ మీరు పోగొట్టుకొన్నారా?" అన్నాడాయన సానుభూతి ధ్వనిస్తూ.

"మరేనండి. ఇందాక ఇక్కడే జేబులో నుండి కాగితాలు తీశాను. అప్పుడు పడిపోయి ఉంటుంది. ఇప్పుడా షాపులో డెంటల్ క్రీమ్ కొనుక్కొని డబ్బు ఇద్దామని చూస్తే ఎక్కడుంది? చివరికి మా ఫ్రెండు ఇచ్చాడు డబ్బు." అంటూ చేతిలోని కాల్గేట్ క్రీమ్ అవతలాయనకు చూపించాడు శేఖర్.

"ఎవరూ మీ జేబు కొట్టెయ్యలేదు కదా!"

"అబ్బేలేదండి. ఇక్కడే పడిపోయి ఉంటుంది. పదినిముషాలయినా కాలేదు. ఇంతలో ఎవరికి దొరికిందో ఏమో..."

"నేను ఇప్పుడే ఇక్కడికి వచ్చానండి.

నేను చూస్తుండగా ఎవరికీ దొరకలేదని కచ్చితంగా చెప్పగలను."

ఇంతలో అటు ప్రక్కనుంచి మరో ఆసామి వచ్చాడు.

"మీ రిక్కడగాని వందరూపాయల నోటు చూశారా?" అన్నాడు శేఖరం.

"వందరూపాయల నోటేమిటి?" అన్నాడతను తెల్లబోతూ.

మొదటి ఆసామి రెండో ఆసామికి శేఖరం కథంతా చెప్పాడు. శేఖరం విచారంగా నేల చూపులు చూస్తూ వెతుకుతున్నాడు. ఆ పెద్ద మనుషులిద్దరు తోడు వెతకసాగారు.

దారినపోతున్న గళ్ళ షర్టు అబ్బాయి అడిగాడు ఏమయిందని.

"వందరూపాయల నోటు పోయింది."

"ఇక్కడేనా?"

అవునని నిట్టూర్చాడు శేఖర్

ఆ కుర్రాడు వెతకసాగాడు.

ఆ ప్రక్కనే శనగలమ్ముకొంటున్న ముసలాయన తన బుట్ట పక్కకు పెట్టి వందరూపాయల నోటుకోసం వెతకటం మొదలు పెట్టాడు. డబ్బులడుక్కోటానికి వచ్చిన చింపిరి తలకుర్రాడు, వాడి చీమిడి ముక్కు చెల్లెలు కూడా నోటుకోసం వెతుకుతున్నారు.

పదినిముషాలు గడవకుండానే అక్కడో చిన్నగుంపు చేరింది. ఒకళ్ళనొకళ్ళు అడుగుతూ చుట్టు పక్కల కాలవల్లో, చెత్తకుప్పల్లో అందరూ వెతుకుతూనే ఉన్నారు.

అందరి మధ్య నుంచి శేఖరమెలాగో తప్పించుకొని వెంకటరెడ్డిని వెంటబెట్టుకుని వీధి మలుపు తిరిగాడు. తమ పందెం సంగతి గుర్తుచేస్తూ - "చూశావా నా మాట నిజమయిందో లేదో! మూకతత్త్వం ఒకటే. పల్లెటూరయినా, పట్నమయినా మార్పులేదు. చదువుకొన్నా, చదువుకోకపోయినా భేదంలేదు. పద... పద... సినిమాకు టిక్కెట్లు కొందువుగాని" అన్నాడు శేఖరు.

"నువ్వింతగా ప్రాక్టికల్ జోక్ చేస్తావనుకోలేదురా. డెంటల్ క్రీమ్‌తో సహా ఆ పెద్దమనిషి నమ్మేటట్టు కథ అల్లావు."

శేఖరం విజయోత్సాహంతో నవ్వి సిగరెట్ల కోసం జేబులో చెయ్యి పెట్టాడు. కెవ్వుమనుకొంటూ ఆ చెయ్యి బయటికి లాగి అన్ని జేబులూ వెతకసాగాడు.

"ఏమయిందిరా?".

"నాపర్సు... నా పర్సు... నిన్ననే మనియార్డరు వచ్చింది... రెండువందల నలభై రూపాయలున్న పర్సు..."

(జనవరి 1981)